W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక



వరంగల్

25-2-2026

03



## నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఝాన్సీ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.



05

## కేఎంసికి 10 కోట్ల విరాళం ప్రకటించిన ఎన్నారైల బృందం

స్వదేశం పట్ల మమకారం, పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలనే ధృడ సంకల్పంతో ఎన్ఆర్ఐల బృందం ముందుకు వచ్చింది. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గతంలో అమెరికాలో పర్యటించిన క్రమంలో అమెరికాలో స్థిరపడిన ఎన్నారై లను ప్రత్యేకంగా కలసి వరంగల్ వాసులుగా నగరానికి మీవంతు సహకారం అందించాలని నాయిని కోరారు.



04

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో, జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం మూడు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన మూడవ చివరి విడతలో వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ నల్లబెల్లి మండలాలకు చెందిన సర్పంచులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.





### సీఎం రేవంత్ ధ్యాసంతా ఫ్యూచర్ సిటీపైనే!

# పేదల హెల్త్ సిటీపై లేదా?

### మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

**నత్త నడకన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు**

**పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరిక**

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ, పేదల ప్రాణాలు కాపాడే ఆసుపత్రుల మీద రాష్ట్ర అభివృద్ధి పైన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వరంగల్ నగరంలో గత బిఆర్ఎస్ హయాంలో పేద ప్రజల కోసం నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మంగళవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నేతల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పాటికి 24 అంతస్తుల ఈ భారీ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వచ్చేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు అటకెక్కాయని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

07 మహా, వరంగల్ బ్యూరో



# పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**మహా వరంగల్ బ్యూరో:** ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 ఏ బిఎన్ఎస్ 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 94 పరీక్ష కేంద్రాల్లో హన్మకొండ 52, వరంగల్ 24, జనగామ 16 తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం.పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజు ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని సీపీ ఆదేశించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని సీపీ హెచ్చరించారు.

# పరీక్షల వేళ పర్యవేక్షణ కట్టుదిట్టం

## డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్.. పరీక్షా పర్య వేక్షణాధికారులతో ప్రత్యేక సమావేశం

**మహా వరంగల్ బ్యూరో:** ఫిబ్రవరి 25 వ తేదీ నుండి నిర్వహించబోయే ఇంటర్ వార్షిక పరీక్షల పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఆదేశించారు. మంగళవారం నాడు ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో పరీక్షా పర్యవేక్షణాధికారుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి త్వరలో నిర్వహించబోయే థియరీ పరీక్షల వివరాలు తెలియజేసారు. పరీక్షా పర్యవేక్షకులు అనగా డీఈసీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, ఇంటర్ బోర్డు ఆదేశాల 26 థియరీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షా నిర్వహణను కూలంకశంగా పరిశీలించాలని అన్నారు. మాల్ ప్రాక్టీస్ తదితర అక్రమ పద్ధతులను నిరోధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని అన్నారు. పరీక్షల పర్యవేక్షణకు గాను జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 26 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 26 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 26 పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది బందోబస్తుకు సైతం ఏర్పాట్లు చేయడం జరిగిందని వార్షిక పరీక్షలకు గాను అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో డ్యుయల్ డెస్కులు, గాలి, నీరు, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి తో పాటు సీసీ కెమెరాలు తప్పనిసరిగా




ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు, ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల స్టోరేజ్, కార్యాలయ విధులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలియజేసారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల మానసిక సమస్యల పరిష్కారం కొరకు 14416 నంబరు కు సంప్రదించాలని సూచించారు.

# అంగన్వాడీ కేంద్రాలు అండగా నిలవాలి

**తొర్రూరు,మహా:** అంగన్వాడీ కేంద్రాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించాలని తొర్రూరు ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెద్దవంగర, నెల్లికుదురు,తొర్రూరు మండలాల అంగన్వాడి టీచర్స్ తో ప్రాజెక్ట్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ కమలాదేవి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా ఉండి విధులు నిర్వహించాలని,తల్లి బిడ్డల సంక్షేమం ద్వారా అందించే సేవలను ప్రజా ప్రతినిధుల సహకారంతో సేవలు అందించాలని కోరారు. గ్రామస్థాయి సమావేశాలకు అంగన్వాడి టీచర్లు హాజరుకావాలని కోరారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు ప్రమాదం గురయ్యే తల్లులు మరియు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆడపిల్లలను పెంచలేని, పోషించలేని స్థితిలో ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే శిశు గృహంలో చేర్పించి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తారని అన్నారు.బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. అబార్షన్ చేయించుకోవడం చట్టరీత్య నేరమన్నారు. అలాంటి సంఘటనలు జరగకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపిఓ విజయ లక్ష్మి, మెడికల్ అధికారి మానస, న్యాయవాది ఘనపురం రామకృష్ణ,సూపర్వైజర్లు మల్లేశ్వరి, శ్రీదేవి, ఉషారాణి, శోభా, సునీత, నాగమణి, సరిత, విజయ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.



# పేదల పొట్ట కొడుతున్న నరేంద్ర మోడీ



**తొర్రూరు మహా:** దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తోర్రురూ డివిజన్ కార్యదర్శి పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఉపాధి హామీ కార్మికులకు కనీస వసతులు లేవని గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో టెంటు, మెడికల్ కిట్, తాగునీరు కార్మికులకు తట్టలు పారలు, గడ్డపారలు వంటి ప్రాథమిక సౌకర్యాలను వెంటనే కల్పించాలని, కార్మికులకు వారానికి వారంగా కూలి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.600 చెల్లించేలా కొలతలతో సంబంధం లేకుండా సరైన కూలి పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పనిచేసిన ఉపాధి హామీ కార్మికులకు డబ్బులు పెండింగ్‌లో ఉండటం తీవ్ర అన్యాయమని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో చేస్తున్న సవరణలు కూలీలకు నష్టం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో అమలవుతున్న ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో యథావిధిగా కొనసాగించాలని, కూలీలకు నష్టం చేసే మార్పులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో కార్మికులు, ప్రజలు ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు నెంబర్.ఉడుగుల అనిల్, బీసు వెంకటమ్మ 14 వ వార్డు మెంబర్... గ్రామపంచాయతీ కార్యదర్శి కోడుపుగంటి వెంకన్న, ఫీల్డ్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ మహంకాళి వెంకన్నతో పాటు ఉపాధి హామీ కార్మికులు వెంకటరెడ్డి, తీగల నరసయ్య, గుర్రం వెంకన్న, ధర్మారపు నరసయ్య, మూరగుండ్ల మోహనం, ఆలియమ్మ, సుశీలమ్మ, ఏసమ్మ, శిలుసాని రాములు తదితరులు పాల్గొన్నారు. సుమారు 70 మంది ఉపాధి హామీ కార్మికులు ఈ పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

## సీఎంను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని,ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు మహా:** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఝాన్సీ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం లోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని,తొర్రురు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ చైర్మన్, వైస్ చైర్మన్ గెలుచుకోవడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు.తొర్రురు పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి టీ యూ ఎఫ్ ఐ డీ సీ నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. పట్టణంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి, వీధిదీపాలు, పార్కులు, నీటి సరఫరా తో పాటు ఇతర మౌలిక అవసరాల కోసం ఈ నిధులు అత్యవసరమని వివరించారు.ఎమ్మెల్యే అభ్యర్థన పై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొర్రూరు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసిందన్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ స్పందనను చూసి ప్రతిపక్షాల కండ్లు మండుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకున్నా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సమర్థవంతంగా అభివృద్ధి చేస్తున్నాడని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూసి పాలకుర్తి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు.



## నూతన ట్రాన్స్ ఫారం ఏర్పాటు

### దాట్ల సర్పంచ్ కమ్మినేని మంజుల రవీందర్

**తొర్రూర్ మహా:** వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని దంతాలపల్లి గ్రామ ప్రజలకు నీటి కొరత లేకుండా ఉండేలా, దాట్ల గ్రామం నల్లాల బావి వద్ద 25 కె.వి (ఐదీ) కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను విజయవంతంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల గ్రామ సర్పంచ్ కొమ్మినేని మంజుల రవీందర్,గ్రామ ఉప సర్పంచ్ మిడతపల్లి మధుకర్ ,వార్డు సభ్యులు పంజా నరేష్, సుకన్య, స్వరూప, బోలేషా, దంతాలపల్లి మండల ఏఈ , లైన్‌మ్యాన్ సైదులు, విలేజ్ హెల్పర్ షాడ ఉపేందర్ రెడ్డి, అలాగే కాంతారావు, భాస్కర్, పురుషోత్తం, పర్శయ్య, మాజీ వార్డ్ మెంబర్ ఎల్లయ్య, ఏసేబు గ్రామపంచాయతీ సిబ్బంది తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్ల గ్రామ నాయకత్వం చూపుతున్న చొరవకు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కొత్త ట్రాన్స్ఫార్మర్ ద్వారా నీటి సరఫరా మరింత మెరుగుపడి, వేసవిలో ప్రజలకు గొప్ప ఉపశమనం లభించనుంది.



## లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి




**తొర్రూరు మహా:** లయన్స్ క్లబ్ లు సామాజిక స సామాజిక కార్యక్రమాలు విస్తృతంగా నడుస్తున్నాయని సామాజికవేత్త వరిగొండ కాంతారావు అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్ పర్సన్ దామెర సరేశ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి డివిజన్ కేంద్రంలోని బృందావన్ ఎస్టేట్ లో వీరభద్ర రీజియన్ దామెర సేవా సమ్మేళనం పేరిట లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్ ఘనంగా నిర్వహించారు. రీజియన్ పరిధిలోని లయన్స్ క్లబ్ ప్రతినిధులు భాగస్వాములైన రీజియన్ మీట్ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరి, సంప్రదాయ నృత్యాలతో కార్యక్రమం క్లబ్ ప్రతినిధుల్లో ఉత్సాహం నింపింది.జబర్దస్త్ రాజమౌళి హాస్యవల్లరి కడుపుబ్బ నవ్వించింది.ఉత్తమంగా సేవలు అందిస్తున్న పలు క్లబ్ లకు అవార్డులు దక్కాయి.జిల్లా గవర్నర్ కౌడి చంద్రశేఖర్ ఆర్య, ఐపిడిజి కార్యదర్శి కుందూరు వెంకటరెడ్డి, మాజీ గవర్నర్లు తమ్మెర లక్ష్మీనరసింహారావు, డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి, ఉప గవర్నర్లు నరహరి సుధాకర్ రెడ్డి, పుట్ట హరి కిషన్ రెడ్డి లతో కలిసి వరిగొండ కాంతారావు మాట్లాడారు.మన సమాజంలో ఆపదలో ఉన్న పొరుగువారికి సహకారం అందించాలనే సదాశయంతో లయన్స్ క్లబ్ కార్యక్రమాలు కొనసాగడం అభినందనీయమని అన్నారు.ఎలాంటి లాభాపేక్ష లేకుండా వివిధ లయన్స్ క్లబ్ లు సమాజానికి పలు సామాజిక సేవలు అందించడం గొప్ప విషయమన్నారు.ఎంత సంపాదించినా అందులో కొంత సమాజానికి వినియోగిస్తేనే సంపాదించిన దానికి సార్థకత ఉంటుందన్నారు. సమాజంలో ఎందరో అభాగ్యులు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని, వారికి చేతనైనంత సహాయం అందిస్తే కొంతైనా మేలు చేసిన వారవుతారని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు.రీజియన్ చైర్మన్ దామెర సరేష్ మాట్లాడుతూ....సమాజానికి చేతనైన సాయం అందించడంలో లయన్స్ క్లబ్బులు ముందు ఉన్నాయని, లయన్స్ క్లబ్ వల్లే ప్రజలకు కొంత మేలు జరుగుతుందన్నారు. ఏడాది కాలంలో ఆశించిన దానికంటే ఎక్కువ సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్బులు చేపట్టాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సూర్నం రామ నరసయ్య, లయన్స్ ప్రముఖులు టి. వెంకట్ రెడ్డి,తమ్మెర విశ్వేశ్వర రావు, రేగూరి వెంకన్న,డాక్టర్ కిరణ్ కుమార్,అనుమాండ్ల దేవేందర్ రెడ్డి,చిదిరాల నవీన్ కుమార్, వజినపల్లి దీప, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు,ముడుపు రవీందర్ రెడ్డి, వి.శ్రీనివాస్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగనివ్వద్దు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- కొమ్మాల జాతర బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కలెక్టరేట్ లో మంగళవారం గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి మార్చి 8 వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పోలీస్, ఆరోగ్య, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, పౌర సంబంధాల, అగ్నిమాపక తదితర శాఖలు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయం, అన్నదాన కార్యక్రమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, వైద్య శిబిరాలు, శానిటేషన్ చర్యలు సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జాతర ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వాహక అధికారిని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో, జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం మూడు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన మూడవ చివరి విడతలో వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ నల్లబెల్లి మండలాలకు చెందిన సర్పంచులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక భూమికి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పలు సంక్షేమ పథకాల అమలులో అర్హులకు అందేలా గ్రామ ప్రథమ పౌరుడిగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధీ దీపాల ఏర్పాటు, ఇంటి పన్నుల వసూలు అంశాలను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో జరిగే సంక్షేమ పథకాలు, పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో గ్రామ పంచాయతీల పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సర్పంచులు సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా పని చేస్తూ సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డీపీవో కల్పన, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత

### ఈస్ట్ జోన్ డీసీపీ అంకీత్ కుమార్

**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు ప్రధాన కేంద్రంలో అరైవ్ అండ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ అంకీత్ కుమార్ , పరకాల ఏసీపీ సతీష్ బాబు, ట్రైనీ ఐపీఎస్ మణీషా నెహ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సభను ఉద్దేశించి మాట్లాడి రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా నియమాలు, హెల్మెట్ ధరించే అవసరం మరియు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు ఐదుగురు ప్రజలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా రోడ్ సేఫ్టీపై అవగాహన



కల్పించేందుకు ఆత్మకూరు పోచమ్మ ఆలయం నుండి గూడెఫడ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఇన్స్ స్పెక్టర్ సంతోష్, ఎస్ఐ తిరుపతి, ఎస్ఐ సతీష్ , తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# బ్లేడ్ బ్యాచ్‌పై నిప్పులు చెరిగిన నాయిని

- బిఆర్ఎస్ నేతలు పదేళ్లలో చేసిందేమీ లేదు
- మీ బతుకంతా ఆరోపణలేనా.. అభివృద్ధి పై చర్చకు రారా?
- బిఆర్ఎస్ హయాంలో చేసింది గోరంత అవినీతి కొండంత
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే నాయిని తీవ్ర విమర్శలు



**హన్మకొండ మహా:** వరంగల్ పశ్చిమ డైనమిక్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్లేడ్ బ్యాచ్ పై నిప్పులు చెరిగి బీఆర్ఎస్ నాయకుల పై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బ్లేడ్ బ్యాచ్ అంటే ఎవరో అందరికీ తెలుసని ఈ మాట వింటే బ్లేడ్ బ్యాచ్ వారు కూడా నొచ్చుకుంటారని ఎద్దేవా చేశారు. పదవి డబ్బు శాశ్వతం కాదని నేను ఇంకో రెండేళ్ల నర పాటు ఎమ్మెల్యే పదవీకాలం ఉందని నేను మరలా ఎమ్మెల్యేగా కొనసాగాలో లేదో ప్రజలే నిర్ణయిస్తారని నాకు పదవి పై ఎటువంటి వ్యామోహం లేదని స్పష్టం చేశారు. డబ్బు కోసం చేసే రాజకీయాలకే బీఆర్ఎస్ పరిమితమైందని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధిని కుంటుపడేసి, ఇప్పుడు విమర్శలు, ఆరోపణలే ఆయుధంగా చేసుకుని జిల్లాల్లో జెమిని సర్కస్ లో మాదిరిగా పర్యటనలు చేస్తున్నారని అన్నారు. చేసిన పనులు లేక పోవడంతో రోజువారీ ఆరోపణలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న నగరాన్ని మాజీ ఎమ్మెల్యే అలజడులు సృష్టించి తన గూండాయిజంతో కాంగ్రెస్ కార్యకర్తల పై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాదులో గత మూడు రోజులుగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి సంబంధించిన సమస్యల పై ప్రభుత్వం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని తెలిపారు. పదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు పరిశీలన పేరుతో మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. దాదాపు పూర్తికావొచ్చిన దవాఖానను బయట నుంచే చూసి విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరికరాలు విదేశాల నుంచి రానున్నందున కొంత జాప్యం సహజమని వివరించారు. వరంగల్ మాజీ నేతలకు ఎమ్మెల్యే సూటి ప్రశ్నలు సంధించారు ఉమ్మడి వరంగల్ జిల్లాను విభజించినప్పుడు గానీ, నిధుల కేటాయింపుల విషయంలో గానీ మీరు మీ కెసిఆర్ ను ఎప్పుడైనా ప్రశ్నించారా? మీ కాలంలో జరిగిన అభివృద్ధి ఎంత, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి ఎంత అనే అంశం పై చర్చకు సిద్ధమా?" ఆరోపణలు కాదు చర్చకు రండి అని సవాల్ విసిరారు. బినామీ పేర్లతో కోట్ల రూపాయలు కూడబెట్టిన నేతలు ఇప్పుడు పారదర్శకతపై మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్స్టైల్ పేరుతో అట్టహాసంగా ప్రకటించిన ప్రాజెక్టులు భూమి దశ దాటలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందని, రెండున్నరేళ్లలో తీసుకొచ్చిన పనులు ఎటువంటి అవకతవకలు లేకుండా సాగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్ల పై కమిషన్ల ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. సలహాలు ఉంటే ఇవ్వండి. ఎన్నికల వరకు రాజకీయాలు చేద్దాం. కానీ దాడుల రాజకీయాలను నేను ఎప్పుడూ ప్రోత్సహించ లేదని అన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను ఎన్నికల సమయంలో తప్పకుండా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోండి.మీ ఓటు హక్కు వినియోగించుకోలేని పక్షంలో గూండాలు రౌడీలు రాజ్యమేలుతారని అందుచేత చదువుకున్న విజ్ఞవంతులుగా మీరు సరైన సమయంలో రానున్న ఎన్నికల్లో నాయకుడిని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా నాయిని కోరారు. ప్రజల తీర్పే తుది తీర్పు అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు , కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,జిల్లా ఆర్టిఏ మెంబెర్ పల్లకొండ సతీష్, ఆలయ కమిటీ డైరెక్టర్ సతీష్, బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్, లక్ష్మారెడ్డి, నాయకులు నలుబోల సతీష్, సుగుణాకర్ రెడ్డి,తడుక సుమన్, పున్నం, నాగరాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### కేఎంసికి 10 కోట్ల విరాళం ప్రకటించిన

# ఎన్నారైల బృందం

- పుట్టిన గడ్డ రుణం తీర్చుకున్న ఎన్ఆర్ఐలు
- అమెరికా పర్యటనలో నాయిని కి మాట ఇచ్చిన ఎన్నారైలు
- కేఎంసీ మౌలిక సదుపాయాల కోసం రూ.10 కోట్లు ప్రకటించిన ప్రవాస భారతీయులు
- మీడియా సమక్షంలో ఎన్నారైలను అభినందించిన ఎమ్మెల్యే నాయిని



**మహా వరంగల్ బ్యూరో:** స్వదేశం పట్ల మమకారం, పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలనే ధృడ సంకల్పంతో ఎన్ఆర్ఐల బృందం ముందుకు వచ్చింది. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గతంలో అమెరికాలో పర్యటించిన క్రమంలో అమెరికాలో స్థిరపడిన ఎన్నారై లను ప్రత్యేకంగా కలసి వరంగల్ వాసులుగా నగరానికి మీవంతు సహకారం అందించాలని నాయిని కోరారు. ఈ మేరకు డాక్టర్ సుజీత్ కుమార్ నేతృత్వంలోని సుమారు 200 మంది ఎన్ఆర్ఐలు కలిసి కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ) మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10 కోట్ల విరాళం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆధునిక వైద్య పరికరాలు, అదనపు వార్డులు, రోగుల కోసం అవసరమైన సౌకర్యాలు, విద్యార్థులకు శిక్షణ వనరులు వంటి అంశాలపై ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది ప్రజలు కేఎంసీ తో పాటు ఎంజీఎం ఆసుపత్రులపై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇవే ప్రధాన వైద్య కేంద్రాలు. ఈ విరాళం ద్వారా అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరికరాల ఏర్పాటు, అత్యవసర వైద్య విభాగాల బలోపేతం, శస్త్రచికిత్స సదుపాయాల విస్తరణకు దోహదం కానుంది. ఇటీవలి కాలంలో నియోజకవర్గం లో రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి వంటి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలోనూ అదే దిశగా పురోగతి సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడినా స్వగ్రామ అభివృద్ధి కోసం ఇంత పెద్ద మొత్తాన్ని ప్రకటించడం గర్వకారణమని ఇది కేవలం విరాళం కాదు, వరంగల్ పశ్చిమ ప్రజల ఆరోగ్య భద్రతకు పెట్టుబడి" అని అన్నారు. ఎన్ఆర్ఐల సేవాభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. వరంగల్ నుంచి విద్యను అభ్యసించి విదేశాల్లో స్థిరపడిన అందరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





# వైభవంగా శ్రీ బాలా నగర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

## పాల్గొన్న శ్రీ వారి ఉత్సవ సేవా సమితి బృందం







**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ నగరం బట్టల బజార్ లోని 500 ఏండ్ల చరిత్ర కలిగి ప్రముఖ ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శ్రీ బాలా నగర వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం 6 00 గంటలకు సుప్రభాతం 6 30 గంటలకు తోమాల సేవ 9 00 గంటలకు బ్రహ్మోత్సవ ఆరంభ స్నపనం (అభిషేకం) సాయంత్రం 4 00 గంటల నుండి 6 00 గంటల వరకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం సామూహిక పారాయణం గోవిందాద్రీ గోశాల బృందంచే సుధాకర్ ఆధ్వర్యంలో అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు శ్రీ వారి ఉత్సవ సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్ తో కలిసి భక్తులు, దేవాలయంలో వివిధ సేవా సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగిందని ఆలయ ఈ ఓ ఏలపాటి రత్నాకర్ రెడ్డి, అనువంశిక ధర్మకర్త చైర్మన్ పరాశరం శ్రీనివాసా చార్యులు తెలిపారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష



**హన్మకొండ మహా:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కాజీపేట ఆర్వోబీ, ఇందిరమ్మ ఇండ్లు, హనుమకొండ కాజీపేట తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలకు స్థలాల గుర్తింపు, బీసీ భవన్ , వెల్ నెస్ సెంటర్ లో వైద్యులు, సిబ్బంది కొరత, ఇతరత్రా అంశాలు, వడ్డేపల్లిలో నిర్మాణం లో ఉన్న ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తదితర అభివృద్ధి పనుల పురోగతి పై ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు కు తెలియజేశారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు చేయాలని, కొత్తగా ఇండ్లు నిర్మించుకునే వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దార్థ నాయక్ కు సూచించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. నిరుపేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చిన్న చిన్న కారణాలతో బిల్లులు చెల్లించడం లేదని, అధికారులు బిల్లులు చెల్లింపులు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ, కాజీపేట మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలకు కోసం స్థలాలు గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కు ఉన్న అవకాశాలు పరిశీలించాలని డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్లు రాజు, రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా:** హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇతర అధికారులతో పరకాల మున్సిపాలిటీకి సంబంధించి తాగునీటి సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరా కి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, ప్రతిరోజు నీటి సరఫరా గురించి ,కలెక్టర్ కు మున్సిపాలిటీ కమిషనర్, అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా లో ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ సుచరణ్, ఏఈ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు లాప్ ట్యాప్ లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**హన్మకొండ మహా:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఐదుగురు దివ్యాంగులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా ల్యాప్ ట్యాప్ లను మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు ల్యాప్ ట్యాప్ లను ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, సామాజిక వేత్త ఈ. వి. శ్రీనివాస్ రావు, ఎఫ్ ఆర్వో రవికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ ధ్యాసంతా ఫ్యూచర్ సిటీ పైనే!

- పేదల హెల్త్ సిటీ పై లేదా?..
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్
- నత్త నడకన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు
- పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరిక



**మహా వరంగల్ బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ, పేదల ప్రాణాలు కాపాడే ఆసుపత్రుల మీద రాష్ట్ర అభివృద్ధి పైన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వరంగల్ నగరంలో గత బిఆర్ఎస్ హయాంలో పేద ప్రజల కోసం నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మంగళవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నేతల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పాటికి 24 అంతస్తుల ఈ భారీ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వచ్చేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు అటకెక్కాయని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీపై చూపిస్తున్న శ్రద్ధలో 10 వ వంతు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పై పెట్టినా పనులు ఎప్పుడో పూర్తయ్యేవని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయ్యాయని, కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డిజైన్ల మార్పుల పేరుతో పనులను నత్తనడకన కొనసాగిస్తోందని మండిపడ్డారు. రోగుల బంధువుల కోసం నిర్మించ తలపెట్టిన 'ధర్మశాల' పరిమాణాన్ని సగానికి తగ్గించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, వినయ్ భాస్కర్, టి రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, శంకర్ నాయక్, పార్టీ నేతలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సిబ్బంది లేని ఆసుపత్రి ఎలా?

జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటల పై హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి కనీసం 1500 మంది డాక్టర్లు, 2000 మంది నర్సులు అవసరమని, ఇంతవరకు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇది సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రా లేక బస్తీ దవాఖానానా? అని నిలదీశారు. గతంలో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసిన ఎంజీఎం ఆసుపత్రి అరకొర వసతులతో నేడు ఎలుకలు, పందికొక్కులకు నిలయంగా మారిందని విమర్శించారు. ఆప రేషన్ థియేటర్లలో ఏసీలు పనిచేయక మూసివేస్తున్నారని, రోగులను హైదరాబాద్ కు పంపిస్తున్నారని మండిపడ్డారు.

## పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్ష

ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసుపత్రి పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ తరపున వరంగల్ గడ్డ పైనే నిరాహారదీక్షకు దిగుతామని హరీష్ రావు హెచ్చరించారు.





# కేయూలో కోడికూర కోసం కొట్లాట

- తలలు పగిలేలా కొట్టుకున్న యూనివర్సిటీ విద్యార్థులు
- ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు

**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో చదువుకోవటం కోసం వచ్చిన విద్యార్థులు కోడికూర కోసం కొట్లాడుకున్న ఘటన హనుమకొండ నగరంలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత చదువులకై వచ్చిన విద్యార్థుల మధ్య కోడికూర విషయంలో జరిగిన ఘర్షణ చివరకు చిలికి చిలికి గాలివానగా మారి తలలు పగలగొట్టుకునే వరకు వెళ్ళింది. కామన్ మెస్‌లో ఎంబీఏ, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు కోడికూర కోసం గొడవ పడ్డారు. రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థులు కోడికూర కోసం రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసుకున్నారు. మెస్‌లో చికెన్ పంపిణీలో తేడాలున్నాయనే ఆరోపణలతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి, చివరకు భౌతిక దాడులకు దారితీసింది. రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసుకోవడంతో ఓ విద్యార్థి తల పగిలి తీవ్ర రక్తస్రావమై ఆసుపత్రి పాలయ్యాడు. మరో ఇద్దరు విద్యార్థుల చేతులకు స్వల్ప గాయాలయ్యాయి.యూనివర్సిటీ న్యూ పీజీ హాస్టల్ లో జరిగిన ఈ ఘర్షణ ఆదివారం సాయంత్రం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతకు ఒకరోజు ముందు కూడా, బాయిల్డ్ ఎగ్స్ విషయంలోనూ విద్యార్థుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుందని సమాచారం. ఘర్షణ పడిన వారంతా యూనివర్సిటీ న్యూ పీజీ హాస్టల్‌కు చెందిన వారని తెలుస్తోంది. వీరంతా చిన్న చిన్న విషయాలకే గత రెండు రోజులుగా గొడవలకు దిగుతున్నట్టు సమాచారం. కోడికూర కోసం జరిగిన గొడవలో రాత్రి 11 గంటల వరకు క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు. ఈ ఘటనకు కారణమైన ఐదుగురు విద్యార్థుల పై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీరిపైన సెక్షన్లు 118(1), 351(2), రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద పోలీసులు కేసులను నమోదు చేసి, కేసును దర్యాప్తు చేస్తున్నారు. పాఠాలు చెప్పి, భావితరం భవితవ్యాన్ని తీర్చిదిద్దాల్సిన యూనివర్సిటీలు ఇలా గొడవలకు వేదిక కావటం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత ఆశలతో వచ్చిన తమ పిల్లలు ఇలా కేసుల పాలు కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వారి భవిష్యత్తు పై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారి మృతికి బాధ్యులైన దుండగులను కఠినంగా శిక్షించాలి

**శాలివాహన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహన్**

**మహా వరంగల్ బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన కుమ్మెర మల్లన్న జాతరలో కులం పేరుతో ఓ కుటుంబాన్ని దూషించి , చిన్నారిని కాళ్ళతో తన్ని చిన్నారి మృతికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని శంభునిపేట, రంగశాయి పేట శాలివాహన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం రంగశాయి పేట శాలివాహన సంఘం భవనంలో చిన్నారి మృతికి సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహన్ మాట్లాడుతూ కులం పేరుతో కుటుంబాన్ని దూషంచి దాడి చేయడమే కాక 2 నెలల చిన్నారిని అక్కడున్న పెత్తందార్లు అమానావియంగా చంపడం దుర్మార్గమని అగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఘటన సమయంలో పోలీసులు అక్కడ వున్నప్పటికీ ఇలాంటి దారుణం చోటు చేసుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని, చిన్నారి మృతికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం ఉపాధ్యక్షుడు ఆవునూరి కుమారస్వామి, కోశాధికారులు కుమారస్వామి, భిక్షపతి, సంఘం సభ్యులు దేవేందర్,రాజేష్, సురేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
25-02-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# చిన్నారి మనుశ్రీని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రేగా

**పినపాక, మహా:** మండల పరిధి అమరారం గ్రామంలో మంగళవారం జరిగిన మాజీ ఎంపీటీసీ కాయం శేఖర్,పుణ్యావతి దంపతుల మనవరాలు, కొట్టెం సురేష్ ,స్వర్ణలత ల కుమార్తె కొట్టెం మనుశ్రీ అన్నప్రసన వేడుకకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి ని రేగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ వర్మ, ఎల్చి రెడ్డిపల్లి ఉపసర్పంచ్ సత్తిపండు,నాయకులు చితపంటి సత్యం, కొండేరు రాము,శ్రీనివాసరావు, చెన్నకేశవులు, సుధాకర్ రెడ్డి,కాశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

